523078701

# ప్రబోధ 17

భుజబలంబు మరియు బుద్ధిబలంబుండి
దైవబలములేక దీనుడగును
కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె
మరువబోకు దిట్టి మంచిమాట
దేవుడన్న మాట తెలియునందరికి
మాటతెలిసినంత మాటయేమి
దేవుడైన యట్టి ధన్యుని పూజించి
దేవుడన్న మాట తెలియరయ్య.

జీవునకు అజ్ఞానము తొలగక పరమాత్ముడే తాననే భావము కలుగదు. పరమాత్మ స్వరూపము జ్ఞానము. అదే స్వయం జ్యోతిప్రకాశము. ఆ ప్రకాశమే నేనని, ఆ జ్ఞానమే నేనని మానవుడు నిరంతరము తలచినప్పుడు యిదే అద్వైతస్థితి. వెలుగననగాయేమిటి? పదార్థములను తెలియజేయునది. అయితే మనము నేడు పదార్థములను యే ఆధారములచేత చూడగలుగుచున్నాము. పగలు సూర్యప్రకాశముచేత వస్తువులను మనము చూడగల్గుతున్నాము. రాత్రివేళలయందు చంద్రుని యొక్క వెన్నెలచేతను, నక్షత్రముల ప్రకాశముచేతను, దీపముల వెలుగుచేతను వస్తువులను చూడగల్గుతున్నాము. అయితే యిది సూర్యప్రకాశమనియు, ఇది ఒక కాంతి అనియు యిది దీపము వెలుతురనియు మనమే రీతిగా తెలుసుకోగల్గుతున్నాము? దేని ద్వారా మనము తెలుసుకోగల్గుతున్నాము? కన్నుల ద్వారా మనము తెలుసుకోగల్గుతున్నాము. అయితే నిద్రావస్థయందు మనము స్వప్నమును అనుభవిస్తున్నాము. అయితే యీ నిద్రావస్థయందు కన్నులు లేవు కదా! కన్నులు మూసుకొని వున్నవి కదా. కన్నులు చూచుట లేదే. కాని పగలు చూచినట్లు గానే సమస్త పదార్థములను మనము స్వప్నమునందు చూడగల్గుతున్నాము. అన్ని విధముల కూడను మనము కన్నుల చేత అనుభవిస్తున్నాము. అయితే అక్కడ చూచువాడెవ్వరు? ఈ అనుభవించువాడెవ్వరు? అక్కడ బుద్ధి తన తేజోమయమైన ప్రజ్ఞచేత యీ పదార్థములను చూడగల్గుచున్నది. కాని సుషుప్తియందు ఆ బుద్ధి కూడను లేదు కదా! కాని ఆ సుషుప్తియందు ఆనందమును అనుభవిస్తున్నాడు. ఈ ఆనందమును అనుభవించువాడెవ్వరు? అదియే ఆత్మ. ఈ ఆత్మయే నేను. నేనే ఆత్మ. అనే సత్యాన్ని యీనాడు మనం గుర్తించుకోవాలి. ఆత్మచేతనే బుద్ధి, బుద్ధిచేతనే నేత్రములు, నేత్రములచేతనే పదార్థములు మనము గుర్తించుకోగలుగుతున్నాము. ఈ ఆత్మయే సత్యము. ఈ ఆత్మయే

523078702

నవు. ఇట్టి సత్యాన్ని అనుభవ రీతిలో మనము అనుభవించినప్పుడే యేకత్వమనే దివ్యత్వాన్ని మనం గుర్తించటానికి అధికారులమవుతాము.

దీనికి అద్వైతత్రయములు అనే తత్వాన్ని మొట్టమొదట మనం విచారించాలి. అద్వైతత్రయములనగా మూడు భావాద్వైతము, క్రియాద్వైతము, పదార్థాద్వైతము. ఈ మూడింటి తత్వాన్ని మనము చక్కగా విచారించిన సర్వమూ యేకత్వమనే భావాన్ని మనము అర్థంచేసుకుంటాము.

వస్త్రతంతు న్యాయము. అనగా వస్త్రము దారము దీనియొక్క న్యాయాన్ని మనం విచారించాలి. అయితే యీ రెండింటియందు వుండిన పదార్థం యేమిటి. కార్యకారణములందుండిన ఏకశబ్దము - ఏకవస్తువు తత్వమేయిది. అద్వైతము. ఈ వస్త్రమునందు, దారమునందు వుండిన పదార్థము ప్రత్తి ఒక్కటే. అనగా అనేకత్వములోని యేకత్వాన్ని గుర్తించటమే యిది భావాద్వైతము. అనగా సమస్త మానవులందుండిన తత్వమే ఒకటి అని గుర్తించినప్పుడే యీ భావాద్వైతం మనకు అర్థమవుతుంది. కార్యకారణములందు యేక వస్తువుగా వుంటుండాలి. అనేక పర్యాయము చెప్తుంటారు

పశువులన్నియు వేరు పాలు ఒక్కటే

జీవజంతువులు వేరు జీవుండు ఒక్కడే.

వస్త్ర భేదము వేరు వస్తువొకటె. ఇదే భావాద్వైతము.

క్రియాద్వైతమనగా మనము త్రికరణశుద్ధిగా చేసిన సమస్త కర్మలయందు కూడను ఫలితమును వేరు చేసి పరమాత్మ ప్రీత్యర్థంగా అనుభవించటమే యిది క్రియాద్వైతము. అనగా యిది దైవార్పిత భావముతో కర్మలాచరించటమే క్రియాద్వైతము.

ఇంక వస్తు అద్వైతము. అనగా పదార్థ అద్వైతము. లోకములో యనేక రూపములు నామములు మనము చూడగల్గుతున్నాము. వినగల్గుతున్నాము. రూపనామములు వేరైనప్పటికిని యిందులో మానవులందరు కూడను, జీవులందరు కూడను ఒక్కటే. అందరియందు వుండిన పదార్థము పంచప్రాణములు. ఆకాశాది భూతములు. ఏ దేహమును పరిశీలించినప్పటికిని యీ ఐదు భూతములు తప్ప అన్య భూతములు మనకు కనుపించవు. ఈ దేహమునందు యెట్టి మట్టి కలదో యీ సమస్త దేహములందు అదే మట్టి వున్నది. ఈ దేహమునందు యే జలమున్నదో అదే జలము సమస్త ప్రాణుల యందు వుంటున్నది. ఈ దేహమందు యెట్టి అగ్ని వున్నదో సమస్త దేహములందు అదే అగ్ని వున్నది. ఈ దేహమునందు యే గాలి వున్నదో సమస్త జీవులందు అదే గాలి వున్నది. ఈ దేహమునందు యే శబ్దమును మనము అనుభవిస్తున్నామో సర్వప్రాణులయందు అదే శబ్దము వున్నది. కనుక యీ పంచభూతములనే పదార్థములు సమస్త ప్రాణులందు వుంటున్నవి కనుక దీనిని కేవలము వస్తు అద్వైతము అంటున్నాము.

కనుక భావాద్వైతము, క్రియాద్వైతము, పదార్థ అద్వైతము మనము చక్కగా గుర్తించినప్పుడు సమస్తము యేకమని చక్కగా అర్థమవుతుంది. కేవలం ఉపాధి భేదములను

523078703.

పురస్కరించుకొని మనం భిన్నత్వముగా భావిస్తున్నాము. అన్నింటియందువుండిన దివ్యత్వము ఒక్కటే. ఈ దివ్యత్వమనేది సర్వులయందు కూడను దేదీప్యమానమై ప్రకాశిస్తూవుంటుంది. అగ్నివుంది. ఈ అగ్నిలోపల దహన శక్తివుంటుంది. ఉండినప్పటికి మనం కొంత అలక్ష్యముచేయటంచేత ఆ అగ్నినుండి వచ్చిన బూడిద అగ్నిని మరుగు చేస్తుంది. ఈ మరుగు చేసిన ధూళి యెక్కడనుండి వచ్చింది? అగ్నినుండే వచ్చింది. అగ్నినుండి వచ్చిన యీ యిది అగ్నినే మూసేస్తుంది. అయితే తిరిగి మనము అగ్నిని చూడాలంటే యేమి చేయాలి? ఆపైనున్న బూడిద వుఫ్ అంటే పోతుంది. అగ్ని మనకు కనిపిస్తుంది. అదే విధముగానే ప్రతిమానవుని యందును ఆత్మ అనే ప్రకాశవంతమైన అగ్నివుంటుంది. దానిని మనము మరచిపోతున్నాము. దేనివల్ల? ఈ ఉపాధి భేదం అనే యిది cover చేయటం వల్ల మనం ఆత్మను మరచిపోతున్నాము. సాధనాదిక్రియల చేత మనం దానిని వేరుచేసుకున్నప్పుడు మనం దర్శించుకోగలము.

మరొక విషయము. 'రమేరామే మనోరమే'. అని ఒకపదముంది. సహస్రనామములయొక్క సారము దీనియొక్క పవిత్రత అని చెప్పారు. దీనికి యనేకమంది పండితులు, విద్వాంసులు యనేక విధములైన అర్థములను తెలుపుతూ వస్తున్నారు. 'రమేరామే మనోరమే' దీనికి సరైన అర్థమేమనగా, మనసును భగవంతుని యందు రమింపచేయటమే యింతే. మనమీనాడు మనస్సు అనేక విషయములందు రమింపజేసి రామ రామ అని ధ్యానిస్తున్నాము. చింతించటం ఒకటి. రమించటం మరొకటి. మనస్సును భగవంతునితో సంయోగము చేయటమే సరైన రామభక్తి. అది రమేరామే మనోరమే అనే పదమునకు సరైన అర్థము. రామ అనే పదానికి కూడా మనం కొంత అర్థము తెలుసుకోవాలి. 'రా' అనగా పరబ్రహ్మ తత్వము. 'మ' అనగా ప్రకృతి. కనుక యీ ప్రకృతి పరతత్వమును వదలి వుండుటకు వీలులేదు. అదే గురుపూర్ణిమనాడు చెప్పిన సరైన సందేశము.

ప్రకృతి శుద్ధచైతన్యమును కూడి వుంటున్నది. కనుకనే ప్రకృతి అంతా పదార్థములతో కూడినది. ఈ పదార్థములందు అంతర్భూతమై వుండినదే ఆత్మశక్తి. దీనినే సైన్సులో energy అన్నారు. దీనిని matter అన్నారు. energy అనేది నిరంతరము వుండేది. ఈ భౌతిక energy కాదిది. ఇది శుద్ధతత్వమైన energy. అది నిరంతరమువుండేది. కనుకనే Matter + Being = GOD. ఈనాటి మన energy దినదినమునకు క్షణక్షణమునకు క్షీణించి పోతున్నది. మాటలచేత యనేక విధములైన energy వృథా అయిపోతున్నది. మన దృష్టిచేత మనలో వుండే శక్తి తగ్గిపోతోంది. మన వినికిడి చేత మనలో వుండే energy క్షీణించిపోతోంది. మన తలంపుల చేత మనలో వుండే energy తగ్గిపోతోంది. ఈ విధముగా మానవుడు చేసే ప్రతి క్రియలయందు, ప్రతి దృష్టియందు, ప్రతిమాట యందు కూడను energy అనేది వృథా అవుతున్నది. ఇది ప్రాకృతమైన energy. దివ్యమైన energy యనాటికి క్షీణించేదికాని తరిగేదికాని పెరిగేదిగాని కాదు. కనుక ప్రకృతిని, పరమాత్మను యేనాటికిని యెడబాటులేదు. ప్రకృతి అంతయు పరమాత్మ

523078704

స్వరూపంగా మనము భావించాలి. విశ్వం విష్ణుస్వరూపం. మీరు రాముని చరిత్రయందు చదివి వుండవచ్చు. జనక మహారాజు యింటియందు వుండిన శివధనుస్సును రాముడు త్రుంచాడు. శివధనుస్సు నువిరచినాడు గాని ధనస్సునకు యిటువైపున అటువైపున వున్న నారి మాత్రం తెగలేదు. నారికొక కొస రాముడు, మరొక కొస సీత. ఈ సీతారాముల మధ్యయే మాత్రము యెడబాటు జరుగలేదు. ఈ నారి అనేది తెగకుండా వుండటమనేది ప్రకృతితో సమ్మిళితమైన దివ్యశక్తియే. కనుక దైవత్వమనేది ప్రకృతితో యేనాటికి కూడను యెడబాటు జరిగేది కాదు. అయినా అట్టి దివ్యత్వమైన దైవత్వమునకు, అల్పత్వమైన మానవత్వమునకు సంబంధం యెక్కడ అని మనము కొంతవరకు నిరాశకు గురికావచ్చు. సముద్రము అనంతమైనది. ఎంత అనంతమైనదైనప్పటికీ దానియందున్న గుణములు మూడే. దానిని బట్టపైన వేసుకుంటే తడిగా వుంటుంది. ఈ తడికి చల్లదనముంటుంది. అదే నీరులో నురుగు వస్తుంది తెల్లదనము, చల్లదనము, తడి యీ మూడు సముద్రము యొక్క లక్షణములు. అయితే యీ సముద్రమునందు యే మూడు గుణములు కలవో అవే మూడు గుణములు అల్పమై, అనిత్యమై కొంతకాలమువలె క్షణించిపోయే అలలయందు కూడా వుంటున్నాయి. అలలు మిథ్యమైనవి. అంతలోనే అణగిపోయేవి. ఎన్ని అలలు అణగిపోయినా సముద్రము మటుకు అణగేది కాదు. ఈ అలలే మన దేహములు. ఈ దేహమునకు ఆది అంత్యము వుంటున్నది. ఆద్యంతములతో కూడిన యీ వుపాధియందు ఆ అనంతమైన సముద్రగుణములు కూడా వుంటున్నాయి. కనుకనే ఆ దైవత్వమునకు, యీ జీవత్వమునకు సన్నిహిత సంబంధ బాంధవ్యమున్నదనే సత్యాన్ని మనము గుర్తించాలి. అయితే యీనాడు మానవత్వమనేది ఆధునిక రగాయిలాంటివానిని గుర్తించటానికి దూరమైపోతుంది. ఆధునిక మానవుడు జిరాఫీవలె తయారౌతున్నాడు. జిరాఫీ అనగా దీని అంతరార్థమేమిటి? దాని తలకు, దాని హృదయానికి చాలా దూరంగా వుంటుంది. అనగా యీనాటి ఆధునికుడు యోచించే తన తలకు హృదయంలో వుండే ప్రేమకు ప్రవృత్తి భిన్నభేదముగా కన్పిస్తున్నాడు. జిరాఫీని జూలో చూసే వుంటారు. దాని మెడ చాలా పొడుగు కాని దాని తల యెక్కడో వుంటుంది. దాని హృదయం యెక్కడో వుంటుంది.

అదేవిధముగా యీనాటి ఆధునిక విద్యార్థులంతా తలకు, హృదయానికి సంబంధము లేకుండా జీవిస్తున్నారు. తలకు, హృదయానికి సన్నిహిత సంబంధ బాంధవ్యము చేర్చాలి. ఈనాడు యీ యేకత్వమనే విచారణకు అతిదూరంగా వుంటున్నాము. కారణమేమిటి చేతినిండా పనిలేదు. హృదయము నిండా మంచి భావములు లేవు. చేతినిండా పని హృదయము నిండా మంచి భావాలు లేకపోతే వీని యొక్క జీవితము కుక్కతోకగా తయారౌతుంది. ఈ కుక్కతోక యిలా వుంటుంది. బద్దవేసి కట్టినంత వరకు చక్కగా వుంటుంది. అది విప్పివేసిన తక్షణమే తిరిగి ముడుచుకుంటుంది. ఈనాడు సత్సంగములయందు, యిలాంటి సమావేశములందు వుండిన మనసు బయటకు పోకుండా వుండలేదు కారణమేమిటి?. హృదయము

523078705

నిండా దుర్భావములు, దుశ్చింతలు, దురాలోచనలు. కనుక మొట్టమొదట యీ యవ్వనత్వమునందు మనం చేతి నిండా పని చేయాలి. హృదయము నిండా మంచి భావములు నింపుకోవాలి. ఈ విధమైన జీవితాన్ని మనము పోషించుకున్నప్పుడే యీ అనంతత్వములోని ఏకత్వాన్ని మనము అర్థము చేసుకొనేందుకు వీలవుతుంది. మనము దేనినీ త్యాగం చేయనక్కరలేదు. భోగమునందు కూడను త్యాగమును మనము అనుభవించవచ్చు. అనగా దీని భావమేమిటంటే మనం విషయాసక్తిని, అహంకారమును దూరంగా వుంచుకొని యే కార్యమును మనము ఆచరించినప్పటికీ నీ మనసు సమత్వమైన పవిత్రతనే బోధిస్తుంది. ఈ విధమైన మార్గమును మనము నిత్యజీవితములో అనుభవింప జేసుకున్నప్పుడే దైవత్వము మనకు చక్కగా అర్థమవుతుంది.

దైవ అనే పదమును కూడ మొట్టమొదట మనం అర్థం చేసుకోవాలి. దైవ అనగా సమిష్టి అని అర్థము. సమిష్టి అనగా యావత్ప్రపంచమంతయును దైవత్వమే. దీనినే గీతయందు విరాట్స్వరూపమన్నారు. విశ్వమంతయు సమిష్టితో కూడినదే కనుక దీనినే దైవ అని చెబుతూ వచ్చారు. ఈ దైవత్వాన్ని మనము అనుభవించుకోవాలంటే దైవం యొక్క నామాన్ని మనం అర్థం చేసుకోవాలి. అనగా యీ నామమునకుండే అర్థాన్ని మనము తీసుకోవాలి. నా అనగా కాదు లేదు. మ అనగా నాది అని. నామ అనగా నాది కాదు అనే అర్థాన్ని తీసుకోవాలి. ఒక రాధ, కృష్ణ అనే నామాలు కాదు. నాది కాదు అనే భావముతో నామము నాచరించాలి. నామాన్ని 'నామ' అని మార్చుకుంటే అదే నామస్మరణగా మారిపోతుంది.

దివ్యత్వములో వుండే అంతరార్థములు అనంతంగా వుంటున్నాయి. ఈ అనంతమైన నామములో యదార్థమును మనము విస్మరించి అనర్థాన్ని మనము స్వీకరిస్తున్నాము. ముఖ్యముగా దీనికి కారణము అవివేకము, అవిద్య. దీనికి వాసనాశక్తి బలవత్తరమైన కారణం. ఈ వాసనాసక్తి అనగా కేవలం తన తత్వాన్ని తాను విస్మరించి పరుల తత్వాన్ని ఆశ్రయించటమే. సత్యాన్ని అసత్యముగాను, అసత్యాన్ని సత్యంగాను నిరూపిస్తుంది, శాశ్వతాన్ని అశాశ్వతంగాను, అశాశ్వతాన్ని శాశ్వతంగాను విశ్వసిస్తుంది. ఈ అవిద్య అద్దము వంటిది. మనము నిల్చున్నప్పుడు మనకు కుడిచేయి ఎడమచేయిగా కన్పిస్తుంది. ఎడమచేయి కుడిచేయిగా కన్పిస్తుంది. అదే దీని విరుద్ధము. సత్యాన్ని అసత్యంగా అసత్యమును సత్యముగా నిరూపిస్తుంది.

ప్రజ్ఞామాంద్యము యే లక్ష్యాన్ని నిరూపిస్తుంది? ఏ మంచి విషయాలు చెప్పినప్పటికి అవి చెవికి అందవు. మంచి విషయములు వినాలి అని అన్పించినప్పుడు యనేక విధము బూజోమలవలె యీ ప్రజ్ఞామాంద్యము మన చెవి చుట్టూ చేరి దానిని వేరు చేయుటానికి ప్రయత్నిస్తుంది. మనము యే మంచి విషయములు గాని పూర్తిగా మన చెవికి చేర్చుకోము. చెడ్డ విషయాలైతే రెండు చెవులూ యెకాగ్రతతో వింటాయి. దీనినే

523078706

ప్రొద్దుబోక యూరివారి సుద్దులన్న
మరుసిద్ధమాదురే కడుశ్రద్ధతోడ
ముద్దుముద్దుగాను భగవత్ ముచ్చటలు చెప్పునపు
ఒద్దిక నుండరే చెవులార.

దైవవిషయాలు చెప్పేసమయంలో పవిత్రమైన ఆత్మతత్వం బోధించేసమయములో యీరెండు చెవులు East and West విరుద్ధమైన మార్గాన్ని అవలంబిస్తాయి. చెడ్డవిషయాలు వినాలంటేరెండు యేకమైపోతాయి. ఈ లక్షణము తే ప్రజ్ఞామాంద్యము.

మూడవది వితర్కము. ఏది చెప్పినప్పటికి దానికి విరుద్ధమైన అర్థాలు కల్పించటము ఒకచిన్న ఉదాహరణము. ఒకపరమ భక్తుడు

శుక్లాంబరధరం విష్ణుం - శశి వర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోప శాంతయే.

అంటాడు. అనగా తెల్లని వస్త్రములు ధరించినవాడు విఘ్నేశ్వరుడు. విష్ణుం సర్వవ్యాపియైనవాడుయీ విఘ్నేశ్వరుడు బూడిదరంగుతో కూడినవాడు. చతుర్భుజం నాలుగు చేతులుకల్గినవాడు. ఇది పరమ భక్తులు వర్ణించే విఘ్నేశ్వరుని వర్ణన. భక్తుడు కానివాడు దీనిని యెలా వితర్కించేస్తాడంటే. శుక్లాం బరధరం గుడ్డలుంతామోసేదిగాడిద. విష్ణుం యెక్కడబజారులో చూచినా తిరిగేది. దానినికట్టేసే వాడుయెవడులేడు. సర్వవ్యాపిగాస్వతంత్రముగా తిరుగుతూవుంటుంది. అదిగాడిద. బూడిదరంగులోవుండేది గాడిద. చతుర్భుజయే నాల్గుకాళ్లుండేది గాడిద. దీనికి యెంత విరుద్ధంగావుంది. కనుకనేమంచిని చెడ్డగా చెడ్డను మంచిగా తనయిష్టమువచ్చినట్లుగా దానిని వర్ణించటానికి ప్రయత్నిస్తాడు. కుతర్కి.

నాల్గవది విపర్యదురాగ్రహము. అనగా అహంకారి యేమీతెలియకపోయినా నాకు అన్నితెలుసు. నాకు ఒకరు చెప్పేదేమిటి? అన్ని తెలిసినవాడు యీ అనర్థములో యెందుకు ప్రవేశించాలి. ఇదికేవలము విపర్యదురాగ్రహము. అనగా తనలోవున్న మూర్ఖత్వము. ఎట్టిమానవుడైనా సరిదిద్దవచ్చుగాని మూర్ఖుని సరిదిద్దలేము. ఈనాటి మానవునియందు విపర్యదురాగ్రహము కుతర్కము, ప్రజ్ఞామాంద్యము, అవిద్య యీనాల్గు తాండవమాడుతున్నాయి. ఈనాల్గింటిని దూరము చేసుకోటానికి ప్రయత్నించేయాలి. దీనికి చేయవలసిన ప్రయత్నమేమిటి?

మనము యనేకవిధములైన సాధనలు సల్పుతున్నాము. ధ్యానం చేస్తున్నాము ధ్యానమంటే యేమిటి? కన్నులు మూసుకొని, పద్మాసనం వేసుకొని, వస్త్రములు బిగించుకొని కూర్చోటము. ఇది ఫోటోకోసం అంతేకాని యిది నిజమైన ధ్యానం కాదు. ధ్యానమునకు ఒకపద్ధతేలేదు. మనసు భగవంతునిపై నియమించటమే నిజమైన ధ్యానము. ఈ జీవితమంతా ధ్యానముతో కూడినదే. మీరు పుస్తకాలు చదువుతూ దానిపైన ధ్యానం పెట్టారు. అక్కడ నీవు ధ్యానము చేయకపోతే పుస్తకాలు

523078707.

నీవుచదవలేవుకదా. నీవు లెటర్ రాస్తున్నావు. లెటర్ వ్రాసే సమయములో యే అక్షరానికి ప్రక్కన మరో అక్షరం రావాలి అనే విషయం పైన ధ్యానము లేకపోతే లెటర్ నీవు వ్రాయలేవు. బజారులో నడవాలంటే యెక్కడ యే కారు వస్తుందో, యెక్కడ యే లారీ వస్తుందో యెక్కడ యే మనిషి వస్తున్నాడో అనే ధ్యానమే లేకపోతే నీవు బజారులో నడవలేవు. నీవు భోజనం చేసే సమయంలో యెక్కడ యే కూర వుంది, యెక్కడ యే పచ్చడి వుంది అనే ధ్యానం లేకపోతే నీవు దానిని భుజించలేవు. కనుక జీవితములో తెల్లవారి మొదలు రాత్రి పరుండునంతవరకు walking, talking, Reading writing, eating అన్నీ కూడను ధ్యానమే. అనగా యే విషయమునందు మనసును యిముడుస్తామో అదంతా ధ్యానమే. అయితే యీ ధ్యానములో రెండు రకములైన ధ్యానములు. ఇది ప్రాకృత ధ్యానము అది పరాకృత ధ్యానము. ఇది పదార్థము అది పరార్థము. కనుక పరిపరి విధములుగా పరుగెత్తే యీ మనసును కట్టి పరమాత్మునివైపు మరల్చటమే నిజమైన ధ్యానము. ఇటుపోయే మనసును అటు త్రిప్పటమే. అటు త్రిప్పితే చాలు మనకు మోక్షం లభిస్తుంది. ఇటు త్రిప్పితే చాలు బంధమేర్పడుతుంది. తాళం వుంది. తాళం చెవి వుంది. తాళం చెవిని తాళంలో పెట్టి ఎడమ వైపు త్రిప్పితే open అవుతుంది. కుడి ప్రక్క త్రిప్పితే మూసుకుంటుంది.

మన హృదయమే ఒక Lock. మన మనసు తాళంచెవి దానిని హృదయములో పెట్టి God side turn చేయి. deattachment. world side turn చేయి attachment. కనుక మనసును భగవంతునిపైన మరల్చటమే నిజమైన ధ్యానము. కాని ఆ సూక్ష్మాన్ని గుర్తించుకోలేక గంటలు గంటలు ధ్యానములో కూర్చుంటున్నాము. ఆ గంటలలో కొన్ని గంటలు నిద్రలో చేరిపోతాయి. యింక కొన్ని నిముషాలు అనవసరమైన చింతలలో మునిగిపోతాము. ఎందుకీ లాంటి ధ్యానము చేయటము. ఇలాంటి ధ్యానము చేసే బదులు యింటిపనులు చేయవచ్చుకదా! ఇంకేమైనా సమాజసేవలు చేయవచ్చు. అదే వుత్తమము యీ ధ్యానముకంటె. ఒక్క క్షణమైనా కూడను మనసు నిలకడలేని ధ్యానం చేసి ప్రయోజనమేమిటి? కనుక యీ ధ్యానముకంటె సర్వులయందు వుండిన దైవత్వాన్ని ప్రేమించు. అదే నిజమైన ధ్యానము. Love all serve all. ఈ రెండిటి యొక్క తత్వాన్ని మనము గుర్తించాలి. ఒక జీవుని చూసి ద్వేషించటము మరొక జీవుని చూసి ప్రేమించటము. ఒక జీవుని హింసించటము మరొక జీవుని ప్రేమించటము. ఇది దైవత్వానికి తగదు. కనుక సర్వులను ప్రేమించే తత్వాన్ని మనము గుర్తించాలి.

ఈ మానవత్వంలో ఐదు విధములైన తత్వములుంటున్నాయి. మానవదైవత్వం, మానవ మానవత్వం, మానవ దానవత్వం; మానవ పశుత్వం; మానవ హీనత్వం. ఈ ఐదింటిని మనం చక్కగా గుర్తించాలి.

మానవునియందు ఒక దైవత్వముంటున్నాది. అదే ఈశావాస్యమిదం సర్వమ్ తనయందున్న ఆత్మతత్వమే కనుక తనను లేకపోయినప్పుడు యీ జీవితము వ్యర్థ

523078708

మవుతుంది. కనుక యిట్టి ఆత్మతత్త్వంపైననే మనసును యిమిడ్చి యీదేహమనేది ఒక వుపాధిగా భావించి, పుణ్యకార్యములందు, పవిత్రమైన మార్గములందు జీవితాన్ని ప్రవేశింపచేయటమే. నిరంతరము మంచి చింతన చేయటము, దానధర్మములలో మనము ప్రవేశించటము, సేవాది కార్యక్రమములలో మనము ప్రవేశించటం, దైవప్రేమతో మన జీవితాన్ని ముంచటము యిది మానవదైవత్వము.

మానవ మానవత్వమంటే కర్తవ్యకర్మలాచరించటము. బ్రహ్మచర్యము. గృహస్థం, వానప్రస్థం, సన్యాసం. ఈ నాల్గు మార్గములందు జీవితాన్ని సక్రమంగా ప్రవేశపెట్టుకోటం ఆ వయోభేదమును పురస్కరించుకొని మన ప్రవర్తను పవిత్రమార్గంలో ప్రవేశపెట్టటము కనుక మానవుడు చేయకల్గిన విషయములు సత్యధర్మశాంతిప్రేమలనేవి. ఈ మానవత్వాన్ని కూడ సప్రవర్తనలో మనం జీవితాన్ని గడపాలి. ఇది మానవ మానవత్వం.

మానవ అంటే యేమిటో మొట్టమొదట అర్థం చేసుకోండి. నవ అనగా క్రొత్తది. మా అనగా కొత్తది. క్రొత్తది కానిదే మానవత్వం. అనగా యిది క్రొత్తది కాదు. అనేక జన్మలుగా వస్తుంటుంది. పాతదే యిది. రోతదే యిది. అంతేకాకుండా మరొక అర్థాన్ని కూడా మనం తీసుకోవాలి. మానవ. మా- అనగా అజ్ఞానము. న- అనగా లేకుండా- వ అనగా వర్తించటం. అనగా అజ్ఞానం లేకుండా వర్తించేదే మానవత్వము. కనుక యిలాంటి అపవిత్రమైన మార్గములలో పోకుండా దివ్యమైన మానవునికి అనుగుణమైన ధర్మమార్గములో ప్రవేశించటము మానవత్వం.

ఆహార విహారములందు మాత్రమే కాకుండా, ఆచరణలయందు కూడను ఉ(ULL) అనగా కఠినమైన మార్గాన్ని అవలంబించటం. దయాదాక్షిణ్యములను, నీతినియమములను కోల్పోయిన జీవితము యిలాంటిదే దానవత్వము. కేవలం స్వార్థమే తన పరతత్త్వము పరోపకారమనేది వాని జీవితములో యేనాడు యెరుగడు. ఈ స్వార్థముతో కూడిన తత్త్వమే దానవత్వము. ఆకారము మానవత్వము క్రియలు దానవత్వము. కనుక మానవదానవత్వమని చెప్పారు. ధర్మవిరుద్ధములైన కార్యములందు ప్రవేశించటము.

ఈ మానవ పశుత్వమంటే యేమిటి? ఆహార, నిద్ర, మైథునాదులు తప్పయింకా దానికేమి అవసరం లేదు. తినటం, నిద్రించటం, ఆశలుపడటం అనుభవించటం. ఈ నాల్గు పశుత్వానికి లక్షణాలు. హిందీలో చెప్తారు ఖానా, సోనా, మర్‌నా అంటారు. తినటము, నిద్రించటము, చావటం. యిలా చావటం. అనుభవించి చావటం. దీనికింక మరో పదార్థము యేమీ లేదు. ఇదే మానవ పశుత్వం. ఇలాంటి మానవ పశుత్వంకంటె అధమమైనది మరొకటి వుంది.

మన స్వార్థాన్నైనా వదులుకొని పరులకు హింస గల్గించాలి. తన రెండు కన్నులూ పోయినా ఫరవాలేదు. యింకొకనికి ఒక కన్ను పోవాలి. ఏమి దుర్భావము. ఉపకారం చేసినవానికే అపకారం కల్గించటం. అది హీనత్వం. కాని అది కాదని చెప్పినమానవత్వం. ఉపకారికి ఉపకారం చేయటం గొప్ప మానవత్వం కాదు. అపకారికి ఉపకారము నెపమెన్నక చేయి అపకారికి కూడ

523078709

ఉపకారముచేయుటయు మానవత్వము.

కనుక నేను అన్నింటికన్నా అధమమైన మానవత్వంకంటె, పశుత్వంకంటె, యీ దానవత్వంకంటె మానవత్వ మానవత్వమును మనము గడుపుకోటానికి ప్రయత్నించాలి. కానీ మాన వద్దైవత్వమును పొందటానికి మనకు సాధ్యముకాదు. మానవుడు మానవునిగానైనా బ్రతకటానికి ప్రయత్నించండి. అందులోనే దైవత్వము పొందవచ్చు. మనము ఎన్నిచదువులుచదివి నప్పటికి, ఎన్నిపట్టాలుమనం అందుకున్నప్పటికి, ఎంత గొప్పపదవులు మనం యేలినప్పటికి మానవత్వాన్ని మాత్రం వదలుకోకూడదు.

మానవత్వమేలేకపోతే చదివిన చదువులంతా యెలాంటివంటే శ్మశానములోనక్కల అరుపులవంటివి అన్నారు. శ్మశానములో నక్కలు అరుస్తూవుంటాయి నోరుతెరచిగట్టిగా. అట్లనే మనము స్కూలులో చదువుతూవుంటాము గట్టిగా. శ్మశానములోనక్కలఅరుపులు వంటివి యీ చదువులు. మనకెందుకు, మనము మాటలతో యెక్కువ చెబుతున్నామే కాని క్రియలలో మనము యేమాత్రం అనుసరించటంలేదు. అన్నీ తెలిసిన విద్వాంసులుగా మనము విఱ్ఱవీగుతున్నామే గాని ఆచరణలో శూన్యముగా వుంటున్నాది. వేదశాస్త్ర యితిహాస పురాణములన్ని కంఠస్థము చేస్తున్నారు. కానీ చేతల్లో యేమాత్రము ఆచరించటంలేదు. యిలా కంఠస్థము చేసుకున్నవి కంఠానికి భారమే తప్ప యేమీ సుఖములేదు. ఆచరణలో చూపించాలి.

అనేకత్వములోని యేకత్వాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కనుక మొట్టమొదట మనము భావాద్వైతాన్ని మనము అభ్యసించాలి. నీ భావమును దైవత్వములో యిమిడ్చి చేయవలసిన కర్మలు సక్రమంగా చేస్తారా. ఈ కర్మలయందు ఫలితాన్ని దైవార్పితము గావించి నీవు ఆనందించు. నీవు దైవార్పితమైన భావముతో కర్మలాచరించు. దైవత్వము యొక్క అంతరార్థముతో నీవు భావాన్ని వృద్ధిపరచుకో. సర్వులయందు వుండిన పదార్థతత్వము ఒక్కటే. పంచభూతముల యొక్క ఏకత్వాన్ని గుర్తించుకో. ఉపాధిభేదములను మనము పురస్కరించుకోటంవల్లనే యిన్నివిధములైన భిన్నత్వాలను అనుభవిస్తున్నాము. అయితే అన్నింటికి మధ్యలో ఒక మాయ ఆవరిస్తూ వుంటుంది. ఈ మాయ అంటే యేమిటి? మాయ అనగా లేనిది. అనగా లేనటువంటి దానిని వున్నట్లుగా భావించుకోటమే మాయ. ఒక త్రాడును చూశాము. కాని మనలో అజ్ఞానమనే అంధకారము ముంచుకొనివుంది. దానివల్ల త్రాడును చూసి పాముని భయపడుతున్నాము. భయపడి మనము దూరము వెడుతున్నాము. టార్చితెచ్చి దానిపైన వేసేటప్పటికి యిది త్రాడు పాముకాదు అని తెల్సింది. భయంపోయింది. ధైర్యంవచ్చింది. నా వలె యింకెవరైనా భ్రాంతి పడతారేమోనని చేతితో తీసి ప్రక్కన పెట్టేశాడు. ఈ లైటు లేక పూర్వము పాము లేదక్కడ. త్రాడు పోలేదు. టార్చివేసేటప్పటికి పాము పోలేదు. త్రాడు రాలేదు. చీకటిలోనున్నది త్రాడే. లైటు వేశాక వున్నదీ త్రాడే. కానీ పోయింది వచ్చింది మన భ్రమ. ఆ భ్రమనే మాయ. మాయవుండి

నంతవరకు బ్రహ్మ మనకు తెలియదు. భ్రమ పోయినప్పుడే బ్రహ్మ వచ్చిచేరుతాడు. అదే మొన్న గురుపూర్ణిమ రోజు కూడా చెప్పాను. సముద్రములో అలలు అభివృద్ధి అవుతూవుంటాయి. ఈ అలలకు కారణమేమిటి? ఈ అలలకు కారణము జలము. ఈ జలము అలగా మారటానికి కారణమేమిటి? దానికి వాయువు వత్తిడి. ఈ వాయువు వత్తిడివలనే జలము అలగా మారుతుంది. ఇక్కడ మాయయేమిటి బ్రహ్మయేమిటి? జలమే బ్రహ్మ. వాయువే మాయ. ఈ అలనే జీవుడు. ఈ జీవుడనే అలయూ బ్రహ్మము నుండే వచ్చింది. మాయ అనే గాలి వత్తిడి చేత వచ్చింది. దీనిని సరిగా మనం చూస్తే గాలి అంటే గ్యాసు. అంటారు. ఈ గ్యాస అంటే యేమిటి వట్టి అబద్ధమని. కొట్టాడురా వాడు గ్యాస కొట్టాడురా అంటాము అంటే అబద్ధము అని. ఆ ఇయా అనే పదము మద్రాసు వాళ్లకు బాగా అర్థమవుతుంది. కొట్టురా కొట్టురా గాస్ బుడ్డి అంటారు. అంటే అబద్ధము చెబుతున్నాడని అంటారు. సోడాబుడ్డి మీకు తెలుసు. కొట్టేటప్పటికి గ్యాస్ బయటికి వస్తుంది. అంటే ఆ బాల్ లోపలికి వెళ్లేటప్పటికి గ్యాస్ వస్తుంది. అనగా యీ గ్యాస్ యొక్క ప్రెషరు చేత మంచి ఆవిరిలా వస్తుంది. అది మీరు తాగి యీ గ్యాస్‌లోనే తృప్తిపడుతున్నారు. ఈ జగత్తుకంతా గాలే ఆధారము. ఈనాడు మంటలు చేయటం గ్యాసతోనే. సమస్తం గ్యాసతోనే. అసలు జన్మకి కారణం గ్యాస్. అదే మాయ. ఆ మాయ అనే గాలి యీ బ్రహ్మ అనే జలానికి సోకటం చేత జీవుడు అనే అలగా తయారౌతుంది. కనుక మాయ, బ్రహ్మ, జీవుడు మూడు ఒక్కటే. ఈ జీవతత్వం యెలా ప్రారంభమైందంటే యీ మాయ వల్లనే ప్రారంభం అయింది. అందువల్లనే మాయోపాధి జీవుడు అన్నారు.

అయితే యీ మాయను మనమే విధముగా తెల్సుకోవాలి. ఇది కేవలం మనయొక్క భ్రాంతియే. Imagination అని గుర్తించాలి. ఇది దైవాధీనమైనది. కనుక పరమాత్ముని అనుగ్రహాన్ని లేక పరమాత్మ దివ్యస్వరూపాన్ని లేక తన తత్వాన్ని తాను గుర్తించుకుంటే మాయ మనకు వశమైపోతుంది. దైవతత్వాన్ని గుర్తుంచుకుంటే మాయ సహజంగా పోతుంది. దీపం వెలిగిస్తే చీకటి అక్కడ వుండదు కదా! దీనినే తమసోమా జ్యోతిర్గమయ. జీవుడనేవాడు బ్రహ్మనుండి వచ్చినవాడు. ఈ మాయ అనే వత్తిడి చేత నేను జీవుడయ్యాను గాని సాక్షాత్తు బ్రహ్మను అనే విశ్వాసాన్ని మనం పెంచుకోవాలి. మన దృష్టిని విశాలమైనదానిగా మార్చుకోవాలి. మన హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి. ఈ రెండిటి యందు కూడను మన అహంకార మమకారములను దూరం చేయాలి. అందువలనే గీత యందు 'నిర్మమో నిరహంకారః' అజ్ఞాన మోహము అహంకారము దూరము చేసుకోమన్నాడు. ఈ మమత్వము, అహంకారముండినంత వరకు మానవుడు సత్యాన్ని గుర్తించుకోలేడు. ఈ రెండింటిని మనం దూరం చేసుకున్నప్పుడే తన స్వరూపాన్ని తాను చూడగలడు. ఈ జగత్తంతా కేవలము మిథ్యామయముగా కన్పించేది. అన్నింటియందు వుండినది యేకత్వమే అదే సత్యము. ఒక విత్తనం వుంది. ఆ విత్తనం భూమిలో పెట్టాము. భూమి నుండి మొక్క వచ్చింది. మొక్క వృక్షమైంది. వృక్షములో యనేక శాఖోపశాఖలు బయలుదేరాయి. ఆ

వృక్షములోనే పువ్వులు కాయలు పూశాయి. ఆ పువ్వులే కాయలుగా మారాయి. కాయలన్నీ ఫలములుగా మారాయి. అయితే యీ ఫలములు, యీ కాయలు, యీ పువ్వులు యీ రెమ్మలు యివన్నీ యెక్కడ నుండి వచ్చాయి. అన్నింటికి విత్తనమే ఆధారము. అదే సత్యము. అదే ఆత్మ. జాగ్రత్తలో నీవు అన్నీ చూస్తున్నావు. అన్నీ అనుభవిస్తున్నావు. కాని చూసిన దృశ్యములను, యింకా చూడనటువంటి దృశ్యములను స్వప్నములో నీవు అనుభవిస్తున్నావు. ఈ స్వప్నములో లేని ఆనందాన్ని నీవు సుషుప్తిలో అనుభవిస్తున్నావు. కాని జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మూడు కాలములు వేర్వేరుగా వుంటున్నాయి. మూడు కాలములందు వుండిన నీవు మాత్రం సత్యం. అదే ఆత్మ. చక్కెర తీసుకొని వెళ్ళి ఒక కప్పులో వేశాము. ఆ చక్కెరంతా తరిగి నీళ్ళలో సర్వవ్యాపిగా మారింది. నీవు చేతితో వేశావు. కంటితో చూశావు. కాని కరగిన తరువాత చేతికి చిక్కదు. కంటికి కన్పించదు. కానీ ఆ తీపి అనుభూతిలో సర్వత్రా వున్నట్లుగా నాలుకపై వేసుకుంటే తెలుస్తుంది. సర్వత్రా వ్యాపించినటువంటి మాధుర్యమే సత్యము. అదే ఆత్మ. కంటికి కన్పించదు. చేతికి చిక్కదు. అదే నిర్గుణ నిరంజనం అని దీనికి పేరు వచ్చింది. సర్వత్రా వ్యాపించినవాడు కనుకనే యితనికి విభుడు అని ఒక పేరు వచ్చింది. ఎట్టి ప్రమాణమునకు చిక్కనివాడు కనుక అతనికి అప్రమేయుడు అని పేరు వచ్చింది. శబ్ద ప్రమాణమునకు గానీ, అనుమాన ప్రమాణమునకు గాని, ప్రత్యక్ష ప్రమాణమునకు గాని అందేవాడు కాదు. అతనినే అప్రమేయుడు అని అన్నారు.

ఆ విధముగా భగవంతునికి గల ఒక్కొక్క పేరు అంతరార్థముతో కూడుకొని వున్నది. ఏకత్వముతో వుండినవే. సర్వులయందు వుండిన భగవంతుడు ఒక్కడే. సర్వులూ భగవంతుడే. కనుక తనను తాను తెలుసుకోటమే భగవత్ తత్వము. అది అహంకార మమకారములుండినంతవరకు తాను గుర్తించుకోలేడు. ఈ అహంకార మమకారములు దూరము చేసుకున్నప్పుడే ఆ యొక్క తత్వము అర్థమవుతుంది. నీ దేహతత్వాన్ని నీవు అర్పితము చేయి. నీ మనో తత్వాన్ని నీవు అర్పితము చేయి. నీ క్రియాఫలితాన్ని నీవు అర్పితం చేయి. మిగిలిన దొక్కటే. నీవే నా తల్లి, నీవే నా తండ్రి, నీవే నాకు మిత్రుడు, నీవే నా బంధువు అంటావు. తల్లి, తండ్రి మిత్రులు యే నాటికో ఒక నాటికి వదలిపెట్టి పోతారు. కానీ నీవు అనేది యెప్పుడూ వుంటుంది. ఆ సత్యాన్ని మనం గుర్తించాలి. ఏనాటికైనా అవన్నీ పుడిపోయేవే. ఈ అన్నింటి యందు వున్న నేను అనేదే సత్యము.

ఆ I తత్వాన్ని నీవు గుర్తించాలి. who am I? who am I? అని question వేసుకోవాలి. ఈ who am I. I. I. I... అనేటువంటి దానికి రెండర్థాలుంటున్నాయి. ఏకాక్షర I. EYE యిది త్ర్యక్షరి. Eye మన భౌతికమైన ఉపాధి. ఏకాక్షర I ఆత్మ. ఏకాక్షర I నీవు గుర్తించుకోటానికి ప్రయత్నం చేయాలి. ఇయ్యేదో భౌతికమైన నేను bound బం. నేను MA ప్యాసైనాను. నేను Phd చేస్తున్నాను. అంటే అది నీ దేహము యొక్క తత్వము. నేను బ్రాహ్మణుడిని. నేను క్షత్రియుడను. నేను వైశ్యుడను. నేను యువ్వనుడను. నేను వృద్ధుడను అనుకోటం దేహతత్వం. కానీ యేకాక్షర I బ్రాహ్మణుడు కాదు, శూద్రుడు కాదు, ఎవరూ కాదు. body కాదు

523078712

యవ్వనుడుకాదు. వృద్ధుడుకాదు. దానికి కులభేదము, వయోభేదము లేదు. ఏదీ లేదు. అదియెప్పుడు ఒక్కటిగానే వుంటుంది. కనుక ఆ యేకాక్షర I ని నీవు లక్ష్యంలో పెట్టుకో. అదే సర్వత్ర వుంటున్నది. ఆ సర్వత్ర వుంటున్న యేకత్వాన్ని గుర్తించుకోటమే నిజమైన ఆత్మతత్వము.

గురుపూర్ణిమ నాడు చెప్పిన విషయాలు అనేకమంది వినలేదు. మరొకపర్యాయం చెప్పమని మన వైస్ ఛాన్సలర్ చెప్పారు. నాకు కంఠస్తము చేసే అలవాటు లేదు. ఎప్పటికప్పుడే నేను మాట్లాడుతుంటాను. అదే యిప్పుడు చెప్పాలంటే నాకు రాదు. కొంతమంది యేదో ఒకవిధమైన పద్ధతిని పెట్టుకుంటారు. కంఠస్థము చేసుకుంటారు. ఎక్కడికి పోయినా అదే కొట్టేస్తుంటారు తప్పేటులా. ఆవిధముగా నాకు రాదు. నేను అప్పటికప్పుడు వ్యక్తులను చూచి ఆ సమయ సందర్భాలను పురస్కరించుకొని, అడిగిన ఆశయాన్ని కూడ పురస్కరించుకొని నేను మాట్లాడవలసి వస్తుంది.

కాని నా మాటలన్నీ యెప్పుడూ అద్వైతముతోనే కూడి వుంటాయి. ఎందుకంటె ద్వైతం, మరొకటి లేదిక్కడ. ఏకమేవా 2 ద్వితీయం బ్రహ్మ. ఉన్నది ఒక్కటే. ఎన్నివిధాల చెప్పినా అక్కడికే వచ్చి చేరాలి. ప్రాపంచిక విషయములను పరిశీలన చేసినప్పుడు దీనికి ఒక కర్త, కర్మ, క్రియ మూడుగా రూపొందుతుంటాయి. నాకిక్కడ కర్త కర్మ క్రియ మూడు కలసి ఒక్కటే. ఈ పిల్లలకు చెప్పే సమయములో మాత్రము యివన్నీ పాటించాలి. ఈ కర్త కర్మ క్రియ వీటిని కూడా అర్థము చేసుకోలేని మూర్ఖులు కొంతమంది వుంటారు.

ఒక టీచరు క్లాసులోకి వచ్చాడు. దానిలో అన్ని చెప్తూ కర్త కర్మ క్రియ గురించి యేదో సమయ సందర్భాన్ని పురస్కరించుకొని అడిగాడు. అప్పుడు కర్త యెవరురా అన్నాడు. వాడు యీ పాఠం వినలేదు. నిద్రపోతున్నాడు పాపం. ఏదో వాడికి తెలియక సార్ మీరు అడుగుతున్నారు కాబట్టి మీరే కర్త అన్నాడు. ఇంకొకడిని లేపాడు క్రియ అంటే యేమిటిరా అన్నాడు. మీరు చాలా విషయాలు చెబుతున్నారు కనుక ఆ విషయాలు క్రియ అన్నాడు. యింకొకడిని పిలిచాడు. కర్మ యెవరురా అన్నాడు. కర్మ యేమిటి అన్నాడు. సార్ మీ speech వినటానికి మాకిష్టం లేకపోయినా వినవలసి వచ్చింది. ఇది మా కర్మ అన్నాడు. అనగా కర్మ అంటే యేమిటో, కర్త అంటే యేమిటో, క్రియ అంటే యేమిటో తెలియని విద్యార్థులున్నారు యీనాడు. ఇలాంటి విద్యార్థులకు అలాంటి టీచర్సు సంపోతుంటారు. కాని నాకలాంటిది తెలియదు. నేను యెక్కడికి వెళ్ళినప్పటికి అద్వైతమే. ఉన్నది ఒక్కటే. కనుక నేను ఎన్ని మార్గములలో ప్రయాణం చేసినప్పటికి నీ ఆ గమ్యము చేరుతాను.

కనుక విద్యార్థులారా! MY LIFE IS MY MESSAGE. నన్ను మీరు అనుసరించి, ఆ అద్వైతాన్ని మీరు పూర్తిగా అర్థం చేసుకుంటే జగత్తంతా మీరు పరిశుద్ధముగా వుంచినవారౌతారు. ఎప్పుడు అద్వైతాన్ని మనము అర్థం చేసుకుంటామో రాగద్వేషాలు చెప్పకుండా పోతాయి. కనుక యీ అహంకారాన్ని దూరం చేయటానికి, మమత్వాన్ని కొంతవరకు control

చేయటానికి అద్వైతము అనుసరించాలి.. అప్పుడే యెవ్వరిపైనా యేవిధమైన అసూయ, ద్వేషము డంబము, యిలాంటి క్రూర భావములు మన హృదయములో ప్రవేశించవు. మానవుడు మానవుడుగా బ్రతకాలి. దానినుండి మానవ దైవత్వానికి మనం ప్రాకాలి. అంతేకాని మానవ దానవత్వానికి మానవపశుత్వానికి మనం రాకూడదు. ఈ విధముగా మీరు దివ్యత్వాన్ని పొందటానికి తగిన కృషి చేయాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.